క్లుప్తంగా

సమాచారం ప్రజాస్వామ్యానికి ప్రాణ వాయువు

వ్యక్తిత్వ వికాస నిపుణుడు వక్కలంక



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు వక్కలంక

పిఠాపురం: ఆధార సహిత సమాచారం ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాణ వాయువు అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వక్కలంక అన్నారు. గ్లోబల్ మీడియా ఇన్ఫర్మేషన్ లిటరసీ మాసోత్సవాల్లో భాగంగా పిఠాపురం ఆర్‌ఆర్ బీహెచ్‌ఆర్ కాలేజీలో బుధవారం మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు జాతీయ సేవా పథకం (ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు అధ్యక్షతన జరిగిన సభలో వక్కలంక మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారంలో వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపించరాదన్నారు. మానవాభివృద్ధికి అక్షరాస్యతతో పాటు సమాచార అక్షరాస్యత ఎంతో కీలకమన్నారు. ఫాక్ట్‌శాల శిక్షకురాలు సత్య మలిరెడ్డి మాట్లాడుతు సోషల్ మీడియా ద్వారా మనకు వచ్చే సమాచారం తపో ఒప్పో తెలుసుకోకుండా ఇతరులకు పంపించడం సరికాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న సమాచారం మూలాలు, దాని వెనుక ఉన్న వ్యక్తులను గురించి ముందుగానే అంచనా వేయాలన్నారు. సమాచారాన్ని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వెబ్ సైట్‌తో పాటు పలు నమ్మదగిన మీడియా సంస్థలు అందిస్తున్న ఫాక్ట్‌చెక్ వెబ్ వాట్సాప్ ద్వారా నిర్ధారించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డీవీ కాశీవిశ్వనాథం, కళాశాల లెక్చరర్లు సీహెచ్ శ్రీదేవి, జేబీ మాధవి, ఎంసీటీ డైరెక్టర్లు ఎంవీఆర్ ఫణీంద్ర, ఎల్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గంగ

పెద్దాపురం : పట్టణాభివృద్ధి పనుల్లో భాగంగా ఆయా వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు మరింత నాణ్యతతో నిర్మించాలని పెద్దాపురం మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ అధికారులను కోరారు. పట్టణంలోని బంగారమ్మ గుడి వీధిలో ఉన్న శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణంపై మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండలంలో వలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జి.కొత్తూరు, గొంచాల, పీబీ దేవం, పనసపాడు గ్రామాల్లో వలంటీర్లుగా పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని వివరించార. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 24వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

21న చలో అమరావతి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న చలో అమరావతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష చర్యలకు నిరసనగా పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కోర్టు వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. తమకు న్యాయం జరిగే వరకూ విధులకు హాజరు కాకూడదని నిర్ణయించినట్టు పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు తెలిపారు. కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుకు టెండర్లు

తుని: జిల్లా పరిధిలోని ఆర్టీసీ ఖాళీ స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు తుని డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ పాత బస్టాండ్‌లో 4017, పెద్దాపురం పాత బస్టాండ్ 9520, 9844, 5654, కొత్త బస్‌స్టాండ్ 206, పిఠాపురం బస్టాండ్ 1700, ఏలేశ్వరం 175, తుని బస్టాండ్ ఉత్తరం వైపు 13,939, దక్షిణం వైపు 4937 చదరపు గజాల స్థలాలకు టెండర్ల ఆహ్వానిస్తున్నట్టు వివరించారు. టెండర్ల ప్రక్రియపై ఈ నెల 20న రాజమహేంద్రవరం ప్రజారవాణాధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

అంగన్‌వాడీల్లో ఆధునిక విద్యాబోధన

- ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు
- చిన్నారుల్లో మేథోశక్తి పెంచేలా చర్యలు
- పిల్లల తల్లిదండ్రుల ఆనందం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు చెబుతున్న టీచర్

పెద్దాపురం: ఒకప్పుడు ఉప్మా బడులుగా పిలుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు నేడు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే రీతిలో చిన్నారులకు నర్సరీ విద్యను అందిస్తున్నాయి. తెలుగు, ఇంగ్లిష్ భాషలు నేర్చేందుకు వీలుగా ఆధునిక విద్యా బోధనతో ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చెంది అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటి వరకూ కొనసాగిన మూస విద్యా బోధనకు స్వస్తి పలికి, పిల్లల్లో మేథోశక్తి పెంపొందేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానానికి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బోధనా పరికరాలు

మనిషి ఎదుగుదలకు బాల్యం పునాది వంటిది. వారికి బంగారు భవిష్యత్తు అందించేలా బాల్యంలోనే సరైన విద్య నేర్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. భవిష్యత్తుకు అవసరమైన కార్యక్రమాలపై దృష్టి మళ్లిస్తే, జీవితంలో వెనుదిరిగే పని ఉండదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన తీరే మారిపోయింది. అభివృద్ధి చెందిన దేశాల విద్యావిధానాన్ని పరిశీలించి, విద్యారంగ నిపుణులతో చర్చించి, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా టీచర్లు చేసే విద్యాబోధన విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా కిట్లను అందజేశారు.

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 289 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు వయసున్న 7,048 మంది చిన్నారులకు కిట్లను అందజేశారు. రెయిమ్స్, నీతి కథలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలు, కలర్ కార్డులు, బిల్డింగ్ బ్లాక్స్, ఫ్లాష్‌కార్డులు, పోస్టర్లు, చార్టులు, లెర్నింగ్ కిట్లు వీటిలో ఉన్నాయి. అలాగే అక్షరాలతో పాటు అంకెలు, రంగులు, జంతువులు, పక్షులను గుర్తించి, జ్ఞాపకం ఉంచుకునేలా బోధన సామాగ్రిని కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఆధునిక బోధన పరికరాల వినియోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సరైన అవగాహన ఉంటేనే, చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుందున్న ఉద్దేశంతో, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి మండలాల వారీగా శిక్షణ తరగతులను నిర్వహించారు. వారికి నర్సరీ బోధనపై ఉన్నత శిక్షణ ఇచ్చారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, బోధన అభ్యాసన కరదీపిక, పరిసరాల విజ్ఞానం, ఇంగ్లిష్ వర్క్‌బుక్, చిత్రలేఖనం వంటి పుస్తకాలను సరఫరా చేశారు. అలాగే మానసిక వైకల్య పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, తరచూ వైద్య సేవలందించే ఏర్పాట్లు కూడా చేశారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటు బాలామృతం కూడా అందిస్తున్నారు.

చాలా ప్రయోజనకరం

చిన్నారులను బడులకు సంసిద్ధులను చేయడానికి, వారి సంపూర్ణ అభివద్ధి, మేథస్సును పెంచేందేకు ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యా విధానం చాలా ప్రయోజనకరమైంది. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల్లో మెదడు శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో వారికి అవగాహనతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉంది. ఆటపాటలతో విద్య నేర్పించడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి సాధిస్తారు.

విద్యా బోధన భేష్



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునిక విద్యాబోధన భేషుగ్గా ఉంది. గత మెన్నడూ లేనట్టుగా మూడేళ్ల నుంచి ప్రీ ప్రైమరీ స్కూళ్లలో ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తోంది. విద్యార్థులు చక్కని విద్యతో పాటు మంచి మేథస్సు పొందేందుకు ప్రీ ప్రైమరీ స్కూళ్లు దోహదపడుతున్నాయి.

– జి.అరుణ, గృహిణి, చదలాడ, పెద్దాపురం మండలం

బంగారు భవిష్యత్తుకు నాంది



బాల్య దశే వ్యక్తికి మంచి పునాది. ఆ సమయంలో ప్రభుత్వం నాణ్యమైన విద్యనందించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ప్రభుత్వ విద్యా విధానంపై ప్రతీఒక్కరూ ఆనందనం వ్యక్తం చేస్తున్నారు.

– ఎస్.దుర్గాజ్యోతి, విద్యార్థిని తల్లి, పులిమేరు, పెద్దాపురం మండలం

అన్ని రంగాల్లోనూ మహిళాభివృద్ధి



సామర్లకోటలో మెప్మా బజార్‌ను ప్రారంభించిన చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తున్నారని, వారికి ప్రోత్సాహం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక సంత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు తమ జీవనోపాధికి అవసరమైన చేతివృత్తుల్లో శిక్షణ పొంది, అనేక రకాల వస్తువులను తయారు చేస్తున్నారని చెప్పారు. వీటితో ఏర్పాటు చేసిన మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మున్సిపాలిటీల్లోనూ మెప్మాబజార్లను ఏర్పాటు చేయాలని సూచించినట్టు పేర్కొన్నారు. మహిళలు తయారు చేస్తున్న వస్తువులకు ఉన్న డిమాండ్‌ను బట్టి మెప్మా బజారును మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం నెల కోసారి మెప్మా బజార్ ఉంటుందని, దీనిని నిరంతరం కొనసాగించేలా భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తామని మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత తెలిపారు. మెప్మా బజార్‌ను తిలకించి, అనేక వస్తువులను చైర్‌పర్సన్ అరుణ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, పాలిక కుసుమచంటి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాగేంద్రబాబు



హుస్సేన్‌పురంలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్, డాక్టర్లు

పెద్దాపురం: రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఇంటిని, కుటుంబాన్ని జల్లెడ పట్టి వారి గడపవద్దనే ఆరోగ్య సమస్యలను గుర్తించడమే కాకుండా, ప్రతీ ఒక్కరికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం మండలంలోని ఆర్‌బీపట్నం గ్రామంలో జరిగింది. సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సూరిబాబుతో పాటు అతిథులు సత్యవతి, నాగేంద్రబాబు మాట్లాడతూ దేశంలో ఎక్కడా లేనట్టుగా ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనన్నారు. ప్రజలకు తగు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందన్నారు. పరిమి శ్రీను, పుట్టా వెంకట్రావు, పెంకే కిట్టు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు దశల్లో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అదిస్తుందన్నారు. తొలుత రిబ్బన్ కట్ చేసి వైద్య సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్, వైద్య సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పాడలో వృద్ధురాలికి మందుల కిట్ అందజేస్తున్న నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ఈటీపీఆర్ కర్రి హరికృష్ణ రామారెడ్డి కోరారు. మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో హెల్త్ సిబ్బందితో ఇంటింటా సర్వే చేసి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు వేట్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్లు ప్రశాంత్, శ్రీహిమవతి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు, రిపోర్టు కిట్లను అందజేశారు. కార్యక్రమానికి సర్పంచ్ మార్ని నాగమణి అధ్యక్షత వహించారు. పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్, ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ విభాగాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలు అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

కొత్తపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడ సచివాలయం–3 వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మంచి జరిగితే ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీతో పాటు, ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజారోగ్యానికి జీవం పోశారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నేరుగా వైద్యులను ప్రజల వద్దకే పంపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్లు మౌనిక, పి.సుజాత, బి.రేవతి, సందీప్, కార్తీక్ గ్రామంలోని 512 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ వెంకటనారాయణ వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొమరగిరిలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు చేకూరుతోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొమరగిరిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల రూపంలో గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల బతుకులు మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, పచ్చ చొక్కా నేతలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ నాయకులు మేడే సూర్యప్రకాష్‌రెడ్డి, మేడే రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, చింతపల్లి సత్తిరెడ్డి, ఆనాల రాజు, కఠారి చంటిబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ నరుకుర్తి వెంకటలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, గుర్రల వేలమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొమరగిరిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

గాయత్రీదేవి నమోస్తుతే...



పాదగయ క్షేత్రంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి అమ్మవారు



భువనేశ్వరి పీఠంలో మహాలక్ష్మీ దేవి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు



కూష్మాండ అవతారంలో తాటిపర్తి అపర్ణాదేవి



కాండ్రకోటలో మహాలక్ష్మీ దేవి అవతారంలో నూకాలమ్మ తల్లి

పిఠాపురం: నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా పూరూహూతికా అమ్మవారు ప్రత్యేక ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి అమ్మవారు నాల్గో రోజు కూష్మాండ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎర్ర చందనం బాల, పట్టు కాయలతో అమ్మవారిని అలంకరించారు. దుర్గాడ శివాలయంలో లలితామాత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గామాతకు బుధవారం భవానీ భక్తులు లక్షకుంకుమార్చన నిర్వహించారు. వేలాది మంది భవానీల నడుమ అర్చకులు వీరబాబు, దత్తు సోదరులు అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అరటి డొప్పలతో నిర్మించిన హంస వాహనంపై అమ్మవారిని ప్రతిష్ఠించి దుర్గాసహస్రనామాలతో పూజలు నిర్వహించారు. ఉమారామలింగేశ్వరస్వామి వారికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భవానీభక్తులు అగ్ని గుండం తొక్కి తమ భక్తిని చాటుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దుర్గాడతో పాటు పరిసర ప్రాంతాల భవానీ భక్తులు భారీగా తరలి వచ్చి గ్రామంలో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సామర్లకోట : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వేంచేసి ఉన్న అమ్మవార్ల ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రంలోని అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. బాలాపరమేశ్వరీ మంత్ర జపం, దుర్గా సప్తశతి పారాయణ చేశారు. చవితి అనురాధ నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చండీహోమం నిర్వహించారు. నూకాలమ్మ, సత్తెమ్మ తల్లి, కనకదుర్గ, నవదుర్గ, మహాలక్ష్మీ ఆలయాల్లోను, అమ్మవారి శిబిరాల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా దేవీనవరాత్ర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొమరగిరిలో వేంచేసిన కనకదుర్గాదేవి అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహాలక్ష్మి దేవిగా భువనేశ్వరి అమ్మవారు

పెద్దాపురం: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆలయాల్లో బుధవారం అమ్మవార్లు మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. స్థానిక వర్జుల వారి వీధిలోని శ్రీభువనేశ్వరి పీఠంలో భువనేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పీఠంలో మండప ఆరాధన, అమ్మవారికి అభిషేకాలు, సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం, మంత్ర పుష్పం, దర్బారు సేవ తదితర ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

మహాలక్ష్మీదేవిగా నూకాలమ్మ, మరిడమ్మ అమ్మవార్లు

కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు బుధవారం మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈవోలు సీహెచ్ రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



దుర్గాడలో దుర్గాదేవికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భవానీ భక్తులు